మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతుల అగచాట్లు...

- అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి..
- మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి,రైతులను ఓదార్చిన మాజీ మంత్రి
- శ్రీధర్ రెడ్డిని హత్యచేసిన హంతకులను నేటికి పట్టుకోకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం...
- అర్హత లేని వారికి ట్రాన్స్పోర్టు కాంట్రాక్టులు...
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



ధాన్యాన్ని పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న మాజీమంత్రి

**వనపర్తి,మే 24, ప్రభాతవార్త :** నెలల తరబడి రైతులు పడిగాపులు కాస్తున్న చిత్తశుద్ధిలేని ప్రభుత్వం,అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులు అష్టకష్టాలు పడి పండించిన ధాన్యం నీటి పాలుఅవుతుంటే కన్నీటిపర్యంతం అవుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పట్ల నిప్పులు చెరిగారు అర్హతలేని ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలకు కాంటాక్టులు ఇవ్వడం వల్ల రైతులకు ఈ దుస్థితి దాపురించిందని నిరంజన్ రెడ్డి అన్నారు.ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలపై కేసులు పెట్టడం చేతనైతది కానీ శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేండ్లు అయిన నేటికి హంతకులను పట్టుకోకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం అని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలతో కుప్పలు, కుప్పలుగా ధాన్యం తడిసిపోయింది. రైతులు తమ ఆగ్రహ జ్వాలలు ,నిరసన తెలిపారు.వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వల్ల,ప్రభుత్వ నిరక్ష్యంతో తడిసిపోయింది. యూరియా కోసం రోజులు తరబడి క్యూలైన్లలో రైతులు వేచి చూసారు. సి.ఎం. మొత్తం ధాన్యం కొనుగోలు చేశాం అని బాధ్యతారహితంగా ప్రకటనలు చేశారని ఆయన మండిపడ్డారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించి అమ్ముకోలేని దుస్థితి.కె.సి.ఆర్ హయాములో ప్రతి గింజా కొన్నాం.కె.సి.ఆర్ తడిసిన ధాన్యాన్ని ప్రతి గింజా కొని రైతులను ఆదుకున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి, అధికారుల పర్యవేక్షణ లోపం.5లక్షల 42వేల హెక్టార్లలో ధాన్యం పండింది.లారీలు,ట్రక్కులు లేని వారికి ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీ ఇచ్చారు.ట్రాన్స్పోర్ట్ టెండర్లలో లోపం జరిగింది. సివిల్ సప్లైస్ అధికారికి స్టీఫెన్ రవీంద్ర ను డిమాండ్ చేశారు. అర్హతలేని ట్రెస్పోర్ట్ ఏజెన్సీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. ఒకటే ఏజెన్సీ పలుచోట్ల అవకాశం కల్పించారని. పక్షపాత ధోరణితో కేసులు అయిన మిల్లర్లకు ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలు ఇచ్చారు.ఒక మిల్లర్ మంత్రి కుమారునికి రేంజ్ రోవర్ కార్ బహుమతిగా ఇచ్చారు విచారణ చేపట్టాలని డిమాండ్ ప్రభుత్వాన్ని చేసారు. మంత్రి,ఎం.ఎల్.ఏలు తమ అనుచరులకు ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలు ఇచ్చారు. జిల్లాలో 57మిల్లులో పంచనామా చేసి కేవలం 34 మిల్లుల యాజమాన్యాలపై చర్యలు తీసుకున్నారు. మిగతా మిల్లులు అధికార పార్టీకి చెందిన వారిపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.పక్షపాత ధోరణితో తమ అనుకూలమైన మిల్లర్ల కు కేసులు ఉన్నా ధాన్యం కేటాయించారు. మిల్లర్ల సంఘం అధ్యక్షులుపై కేసులు ఉన్నా ధాన్యం కేటాయించారని ప్రశ్నించారు.సోలీపూర్ కు సంబంధించిన మిల్లర్ వల్ల ప్రభుత్వానికి ఆదాయం గండి అయిన ధాన్యం కేటాయింపు ఇలా చేస్తారని. ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలపై విచారణ చేపట్టి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.కోటి నలభై లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మార్కెట్ కు వస్తుంది.45లక్షల మక్కజొన్న మార్కెట్ కు వచ్చింది.రైతులను గాలికి వదిలేసిన చరిత్ర రేవంత్ రెడ్డిదని అక్రమార్కులకు ప్రభుత్వం అండగా నిలిచింది. 90శాతం పాడి ఆరు పెద్ద మిల్లులకు పోతుంది విచారణ చేయాలి. రైతులతో తరుగు,తాళ్లు తీసివేయడం ముమ్మాటికి ప్రశ్నిస్తాం.మిల్లర్లతో ప్రైవేటు సంభాషణలు చేయడంలో మంత్రి, ఏం.ఎల్. ఏల ఔచిత్యం ఏమిటని ప్రశ్నించే గొంతుకలను పోలీసులను అడ్డం పెట్టుకొని ఆపలేరన్నారు.శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేండ్లు అయింది నేటికి హంతకులను పట్టుకోలేదు.ఇది ముఖ్యమంత్రి వైఫల్యం.వెంటనే శ్రీధర్ రెడ్డి హంతకులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల అగచాట్లు,హరిగోసను గమనించిన వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్రికా సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మార్కెట్ మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, పలుస.రమేష్ గౌడ్,మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి,మండల పార్టీ మాజీ అధ్యక్షులు మాణిక్యం,వనం రాములు,జోహెబ్ హుస్సేన్,మహేశ్వర్ రెడ్డి,చిట్యాల రాము, సయ్యద్. జెమిల్, బాగ్యరాజ్ తదితరులు ఉన్నారు. అనంతరం వనపర్తి మార్కెట్ యార్డ్ సందర్శించి రైతులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను పరామర్శించి ఓదార్చారు.రైతుల ఆవేదనను విన్న నిరంజన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరక్ష్యవల్ల నోటికాడికి వచ్చిన ధాన్యం నీటి పాలు అయ్యిందని తడిసిన ప్రతిగింజా కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సంఘీభావం తెలిపి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.నిరంజన్ రెడ్డి వెంట బి.ఆర్.ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు
# ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



విసిలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

**నారాయణ పేట, మే 24 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ మరియు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను పది రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. గోదాములు,లారీలు, హమాలీల కొరత ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని, రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగవంతం చేయాలని సూచించారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడిన కలెక్టర్, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని, మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ డా వినీత్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు : జిల్లా ఎస్పీ

**నారాయణపేట, మే 24,ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పోస్టులు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డా. వినీత్ హెచ్చరించారు. బక్రీద్ పండుగ సందర్భంగా కుల, మత, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు, వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినా, ఫార్వర్డ్ చేసినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఫేస్బుక్ ట్విట్టర్ ఇన్‌స్టాగ్రామ్ వాట్సాప్ గ్రూపులలో ఒక వర్గాన్ని కించపరిచే లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే పోస్టులు, వీడియోలు, ఫోటోలు షేర్ చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసినా సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్లపై కూడా కేసులు నమోదు చేయబడతాయని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలను మంచి పనులకు మాత్రమే వినియోగించాలని, వాటి దుర్వినియోగంపై ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పోలీసులు 24/7 పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, ప్రజలు సోషల్ మీడియాలో ఏదైనా షేర్ చేయడానికి ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

## లారీల కొరత
# లేకుండా చూడాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి,మే 24, ప్రభాతవార్త :** వరి ధాన్యం తరలించడానికి లారీల కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్‌తో కలిసి పెద్దగూడెంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది, ఇంకా ఎంత ధాన్యం మిగిలి ఉంది అనే వివరాలను పరిశీలించారు. ఇంకా 11 వేల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉందని కొనుగోలు కేంద్రం ఇంచార్జి బదులిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షం కారణంగా రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరి ధాన్యం తరలించడానికి లారీల కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి వేగంగా కేటాయించిన మిల్లు లేదా గోడౌన్ కు తరలించాలని సూచించారు. ఆకస్మిక వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యం విషయంలో నిబంధనల ప్రకారం రైతులకు నష్టం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.అకాల వర్షాల వల్ల రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.పౌరసరఫరాల అధికారులు, రెవెన్యూ అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## దొడ్డు వడ్లు పండించిన
# రైతుకు అవస్థలు

### రోడ్లపై తడుస్తున్న ధాన్యం బస్తాలు

**చిన్నచింతకుంట, మే 24 ప్రభాతవార్త :** దొడ్డు వడ్లు పండించిన రైతుకు ఆ వడ్లు కొనేవారు లేక అవస్థలను పడుతున్నాడు. ప్రభుత్వం 1010 రకానికి చెందిన దొడ్డు ధాన్యం వడ్లను మండలంలో 89 ఎకరాలలో సాగు చేశారు. ఈ రకం వడ్లు పండించిన రైతుకు ఇప్పటివరకు రైస్ మిల్లర్లు కొనేందుకు ముందుకు రాకపోవడంతో రోడ్లపైనే ఆరపోసి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉండడంతో రైతన్న ఎన్నో బాధలు పడుతున్నాడు. ఈ దొడ్డు వడ్లను అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయించడంతో ఇదే అదునుగా అతి తక్కువ ధరకు అడుగుతున్నారని రైతన్న ఆవేదనతో వాపోతున్నాడు. ఈ దొడ్డు వడ్ల బస్తాల వద్ద కాపలా కాయలేక తక్కువ ధరకే ఈ వడ్లను అమ్ముకుంటామని రైతులు బాధను దిగమందుతూ తెలుపుతున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు వడ్లను కొనుగోలు చేసి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

# కొనుగోలు పూర్తి చేయాలి

- అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి
- లారీలు, హమాలీల కొరతా వెంటనే పరిష్కరించాలి
- వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం, మంత్రులు పాల్గొన్న
- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



విసిలో మాట్లాడుతున్న మంత్రులు



విసికి హాజరైన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 24, ప్రభాతవార్త:** జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్రమాలు) అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని తెలిపారు.రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్‌ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు.స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయనంతగా ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాక వారికి రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం కావడమే కాక నేల సారవంతత కోల్పోతుందని దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్.పి.డి.జానకితో కలిసి హాజరయ్యారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదన్నారు.మిల్లర్ లు కొనుగోలు కేంద్రం నుండి వచ్చిన లారీల నుండి ధాన్యం జాప్యం దిగుమతి లేకుండా దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ మిల్లర్ లకు స్పష్టం చేశారు.ముందుగానే అవసరమైన హమలీలు ఏర్పాటు చేసుకోవాలని,స్టోరేజి స్పేస్ కూడా సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఆన్ లోడింగ్ సమస్యలు ఎదురు కాకుండా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .ఎల్.బి.హరిప్రియ,డి.ఆర్.డి.ఓ నర్సింహులు,జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్,పౌర సరఫరాల సంస్థ డి. ఎం.రవి నాయక్,ట్రాన్స్‌పోర్ట్ అధికారి రఘు,మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ పాల్గొన్నారు.

## ఎలుగుబంటి దాడిలో
# చెంచు మహిళకు తీవ్ర గాయాలు!

### మేకల కాపలాకు వెళ్లిన సమయంలో ప్రమాదం
### సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎఫ్‌డీఓ చంద్రశేఖర్



దాడిలో గాయపడిన మహిళ

**అచ్చంపేట,మే 24 ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గపరిధిలోని బల్మూర్ మండలపరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నల్లమల అటవీ ప్రాంతంలో మేకలకాపలాకు వెళ్లిన ఒక చెంచు మహిళపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంచుగూడెం గ్రామానికి చెందిన నిమ్మల సాలమ్మ (భర్త నిమ్మల రాములు) రోజువారీలాగే ఆదివారం మధ్యాహ్నం కొండనాగుల ఈస్ట్ బీట్ పరిధిలోని పవన కుంట అటవీ ప్రాంతానికి మేకల కాపలాకోసం వెళ్లారు.అదేసమయంలో తన పిల్లలతో కలిసి సంచరిస్తున్న ఒక ఎలుగుబంటి ఒక్కసారిగా సాలమ్మపై విరుచుకుపడింది.ఈఅకస్మాత్తు దాడిలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. సమాచారం తెలుసుకున్న వెంటనే అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మల్లేశం,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాజు, మీనాక్షిలు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన మహిళను దట్టమైన అడవి నుంచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చి, చికిత్స నిమిత్తం అచ్చంపేటలోని మహదేవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు అత్యవసర చికిత్స అందుతోందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని డా. మహేష్ తెలిపారు. బాధితురాలికి తక్షణ ఉపశమనం కింద అటవీశాఖ తరఫున రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ ఘటనపై అచ్చంపేట ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్‌డిఓ) చంద్ర శేఖర్ స్పందిస్తూ అడవి సరిహద్దు గ్రామాల ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు.ప్రస్తుతం అటవీ ప్రాంతంలో ఎలుగుబంట్లు, పులులు, చిరుతల సంచారం ఎక్కువగా ఉంది. కాబట్టి అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు అడవిలోకి వెళ్లకూడదు. ముఖ్యంగా పశువులు, మేకల పెంపకందారులు, కట్టెల సేకరణకు వెళ్లేవారు ఒంటరిగా వెళ్లకుండా సమూహాలుగా వెళ్లాలి. వన్యప్రాణులు కనిపిస్తే తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి అన్నారు. ఈ ప్రమాదంతో చెంచుగూడెం పరిసర గ్రామాల్లో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. అధికారులు నిరంతరం నిఘా ఉంచి వన్యప్రాణుల నుంచి గ్రామస్థులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# జడ్చర్లలో గాలివాన బీభత్సం

- రోడ్లపై విరిగిపడ్డ చెట్లు..
- ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం
- విరిగిపోయిన రేకుల షెడ్లు తప్పిన ప్రాణపాయం



ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయిన దృశ్యం





రోడ్డుపై విరిగిపడ్డ చెట్లు , కరెంటు స్తంభాలు

**జడ్చర్ల, మే 24, ప్రభాతవార్త :** జడ్చర్ల మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. వర్షపు నీరు రోడ్లపైకి పెద్దఎత్తున రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు ఇండ్ల ముందు ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయి. అరగంట పాటు భారీ ఈదురుగాళ్లతో వర్షం కురవడంతో జడ్చర్ల అతలాకుతలం అయింది. జడ్చర్ల నాగర్ కర్నూల్ ప్రధానరహదారిపై నేతాజీ చౌక్ వద్ద డ్రైనేజీ పనులు కొనసాగుతుండడంతో,వర్షపునీరు అంతా ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చింది.దీంతో ప్రయాణికులు కొద్దిసేపు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రోడ్లపై ఉంచిన భారీకేడ్లు ఈదురుగాళ్లకు రోడ్లపై అడ్డంగా పడిపోయాయి. సిగ్నల్ గడ్డ వద్ద బిఆర్ఆర్ కళాశాల ఎదురుగా వారి వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. సరస్వతీ నగర్ కాలనీలో కరెంటు స్తంభం విరిగిపోయింది. ఆ సమయానికి ఎవరు అక్కడ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. 9వ వార్డు విజయనగర్ కాలనీ రోడ్ నెంబర్ 1 శివలింగం రిటైర్డ్ ఎస్సై ఇంట్లో నివాసంలో ఉంటున్న సింగిల్ రూమ్స్ పైకప్పు గాలి బీభత్సానికి ఎగిరిపోయాయి.



రోడ్డుపై విరిగిపడ్డ చెట్లు , కరెంటు స్తంభాలు

## డి.ఎల్.ఈ.డి పరీక్ష వాయిదా...

**28న బక్రీద్ సెలవు , ప్రిన్సిపల్ మేరాజ్ ఉల్లా ఖాన్**


ప్రిన్సిపల్ మేరాజ్ ఉల్లా ఖాన్

**మహబూబ్‌నగర్, మే 24 ప్రభాతవార్త :** మే 28, 2026న జరగాల్సిన మొదటి సంవత్సరం డి.ఎల్.ఈడి, డి.పి.ఎస్.ఈ పేపర్3 పరీక్షలు బక్రీద్ (ఈద్‌ఉల్‌అజ్హా) సెలవు మార్పు కారణంగా జూన్ 1, 2026కు వాయిదా పడినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినన్ని మహబూబ్ నగర్ ప్రభుత్వ డీ.ఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మేరాజ్ ఉల్లా ఖాన్ ఓ ప్రకటనలు తెలిపారు. విద్యార్థులు పరీక్షల మార్పు తేదీలను గమనించాలని సూచించారు. వాయిదా పడ్డ పరీక్ష డి.ఎల్.ఈడి 1వ సంవత్సరం: పేపర్III (ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్)డి.పి.ఎస్.ఈ 1వ సంవత్సరం: పేపర్III (హెల్త్, న్యూట్రిషన్ కేర్ ఆఫ్ చిల్డ్రన్ వర్కింగ్ విత్ పేరెంట్స్ కమ్యూనిటీ) షెడ్యూల్ ని వివరించారు.తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 28వ తేదీని బక్రీద్ సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ప్రభుత్వం సెలవుల క్యాలెండర్‌లో బక్రీద్‌ను 27గా పేర్కొంది. అయితే, సెలవును గురువారానికి మార్చాలని వక్ఫ్ బోర్డు సీఈవో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం 28న సెలవు ప్రకటించింది.

## ఎంజేపివిసి ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం


కెవి నరసింహ

**మక్తల్ టౌన్, మే 24 ప్రభాతవార్త :** ఎంజేపివిసి ఆధ్వర్యంలో మక్తల్ అసెంబ్లీ పరిధిలో గీతం హై స్కూల్ లో కృష్ణ మగనూర్ మక్తల్ ఉట్కూర్ నర్వ మండలంలో ఆసక్తి గలవారికి వేసవి కాలం శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం అని ఎంజేపివిసి వ్యవస్థాపక అధ్యక్షులు కెవి నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు.మంగళవారం 26/5/2026 నుండి ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఈ కార్యక్రమంలో పాటలు ఎలా రాయాలి నేర్పించడం పాటలు ఎలా పాడాలి నేర్పించడం కవితలు ఎలా రాయాలి నేర్పించడం స్టేజ్ పై ఎలా మాట్లాడాలి నేర్పించడం వంటివి సోసియల్ మీడియా పై అవగాహనా మోటివేషన్ శిక్షణ నిలువు రాళ్ళను సందర్శించి వాటి యొక్క చరిత్ర తెలుసుకోవడం వంటి అంశాల పైశిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ శిక్షణకలో అందరు పాల్గొనవచ్చు అని తెలిపారు ఈ శిక్షణలో మంచి ప్రతిభను కనబరిచిన వారికి ఆకర్షనియమైన బహుమతులు ఇవ్వడం జరుగుతుంది కావున మక్తల్ అసెంబ్లీ పరిధిలో కృష్ణ మగనూర్ మక్తల్ ఉట్కూర్ నర్వ మండలలో ఉన్న ప్రతిభ వంతులు వెంటనే మీ పేరును ఈ నంబర్ కు ఫోన్ చేసి నమోదు చేసుకోగలరు 9393203075అని ఎంజేపివిసి వ్యవస్థాపక అధ్యక్షులు కెవి నరసింహ తెలియజేశారు.

## షూటింగ్ బాల్ అసోసియేషన్ ఎన్నిక

**నూతన అధ్యక్షుడిగా డా.కలాల్ మణికంఠ గౌడ్**


నూతన కమిటి సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, మే 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు, కార్యదర్శి సీహెచ్. ఐలయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం పరిశీలకుడిగా నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. మక్తల్ పట్టణంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ఎన్ని కల అధికారిగా మక్తల్ సీనియర్ అడ్వకేట్ కె. సూర్యప్రకాశ్ వ్యవహరించారు. సమావేశానికి హాజరైన 42 మంది సభ్యులు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కలాల్ మణికంఠ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బి. గోపాలం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి. శివకుమార్, విష్ణువర్ధన్ పీడీ, బి. నరేష్ గౌడ్, డీఆర్. మీనాకుమారి పీఈటీ, కోస్గి విష్ణువర్ధన్ రెడ్డి, గుడిసె నరసింహ ఎన్నికయ్యారు.సంయుక్త కార్యదర్శులుగా రామ్మోహన్‌గౌడ్, జి.బాల్‌రెడ్డి,రేణుక పీడీ,పరశురాం,బాలు అంబిక,కావలి ప్రవీణ్,జాజాపూర్ కృష్ణ, వెంకటేష్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా శివప్రసాద్, నిర్వహణ కార్యదర్శిగా ఎస్. రమేష్ కుమార్ పీఈటీ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డి. సమరసింహారెడ్డి, బి. దామోదర్ పీఈటీ, చంద్రకళ పీఈటీ, ఏ. లక్ష్మీ నారాయణ, నీలిగిరిలను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అబ్జర్వర్ బి. గోపాలం, ఎన్నికల అధికారి కె. సూర్యప్రకాశ్ ప్రకటించారు.ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి ఘనంగా సన్మానించారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ జన్మదిన వేడుకల్లో నాయకులు

**ధన్వాడ, మే 24 ప్రభాతవార్త :** ధన్వాడలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ జన్మదిన వేడుకలను ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా స్థానిక బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు నీరటి నరసింహులు నాయుడు పాల్గొని ఎర్ర శేఖర్ సేవలను కొనియాడారు. అలాగే స్థానిక నాయకులు బాల నరసింహులు, శాంతి కుమార్, మల్లేష్ గౌడ్, శివారెడ్డి, లక్ష్మయ్య గౌడ్, వెంకట రాములు, నారాయణ, బాలరాజు, టెలిఫోన్ వెంకటరాములు, కొల్లంపల్లి హనుమంతు, గోపాల్, హనుమంతరావు తదితరులు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.వేడుకలు సాదరంగా, ఉత్సాహంగా కొనసాగగా, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్, పది విద్యార్థులకు ఘనంగా సత్కారం

**పాల్గొన్న నేరడ్ గోమ్ పంచమ సిద్దలింగ స్వామి**


విద్యార్థులను సన్మానించిన దృశ్యం

**మక్తల్ టౌన్, మే 24 ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడే చదివి ఉన్నత స్థాయిలో రాణించి తల్లిదండ్రులతో పాటు, గురువులు, తమ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని నేరడుగం మఠాధిపతి పంచమ సిద్ధ లింగస్వామి అన్నారు. మక్తల్ పట్టణంలోని ఏఆర్ఎం ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన బిటిఎం సేవా ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధ లింగస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని మక్తల్,మాగనూరు,కృష్ణ,ఉట్కూరు,నర్వ ఐదు మండలాలకు చెందిన సుమారు 200పైగా ఇంటర్ పదో తరగతిలో మండల్ టాపర్లతోపాటు ప్రతి స్కూలు కాలేజీ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. బిటియం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తిమ్మయ్య మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి అత్యుత్తమంగా రాణించే విద్యార్థులకు తమ ఫౌండేషన్ అన్ని రకాలుగా ఆదుకుంటుందని తెలిపారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ సంపాదించిన తిమ్మయ్యను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుభిక్ష అగ్రి ఫౌండేషన్ సహా వ్యవస్థాపకులు గరిడి నరేందర్, రైతు ఆత్మహత్యల గోస పుస్తక రచయిత పులి రాజు, రిటైర్డ్ హెచ్ ఎం రాఘవేంద్ర రావు,అయ్యప్ప అడ్వకేట్, మార్కెట్ డైరెక్టర్ టి.నాగరాజు, ముడుమల్ మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, సత్యనారాయణ, బీటీఎం సేవా ఫౌండేషన్ సభ్యులు ,క్రిష్ణయ్య, వెంకట్, సోఫీ ,రవి కుమార్,నింగప్ప చంద్ర శేఖర్ ,శ్యామ్ ఫార్మర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం...

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి...**



**దేవరకద్ర, మే 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సహకారం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుందని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులకు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, రెండో విడతలు మరిన్ని అర్హులైన కుటుంబాలకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు.రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రంలో నిలిచిపోయిన ఇండ్లను పూర్తి చేస్తామని, పునాదుల దశలో ఉన్న వాటికి మూడు లక్షలు, గోడలు పూర్తి అయిన స్లాబ్ నిలిచిన వాటికి రెండు లక్షలు ఇస్తామన్నారు. అసంపూర్తి ఇళ్ల కోసం నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిధులు కేటాయింపు చేశామన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

**అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్**


రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్

**వనపర్తి రూరల్, మే 24, ప్రభాతవార్త:** అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ అన్నారు.శనివారం కురిసిన అకాల వర్షం కారణంగా వనపర్తి మండలంలోని పలు వరి కొనుగోలు కేంద్రాలు ప్రభావితమైన నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆదివారం వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్ల, పెద్దగూడెం గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీరు చేరి తడిసిపోయిన ధాన్యం కుప్పలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం మరింత తడవకుండా తగినన్ని టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలన్నారు. వర్ష సూచన ఉన్నందున కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యం విషయంలో నిబంధనల ప్రకారం రైతులకు నష్టం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అకాల వర్షాల వల్ల రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఐకెపి, సొసైటీ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

# మూడు జోన్ల అమలు తక్షణమే రద్దు చేయాలి

**కనీస వేతనం 26,000 చెల్లించాలి..**

**టియుసిఐ నిరసన..**


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు

**ఆత్మకూర్ మే 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు వేతనాలు పెంచుతున్నట్లుగా ప్రకటించినప్పటికీ వాస్తవంలో మాత్రం గతంలో కంటే మూడు జోన్ల విధానం మూలంగా కార్మికులకు వేతనాలు తగ్గే పరిస్థితి ఏర్పడిందని తద్వారా మూడు జోన్ల విధానం తక్షణమే రద్దు చేయాలని టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రం ప్రభుత్వం ప్రకటించిన మూడు జనుల విధానాన్ని తక్షణమే నిలిపివేయాలంటూ ఆదివారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో ఆపార్టీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, కేజీబీవీ వర్కర్లకు మూడు విధానాలుగా విభజిస్తూ వేతనాలు పెంచుతున్నట్లుగా ప్రకటించినప్పటికీ వాస్తవ రూపంలో మాత్రం వేతనాలు తిరగకపోవడమే కాకుండా ఉన్న వేతనాలకు కూతపెట్టే విధంగా ప్రభుత్వం వివరించడం నీతిమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ప్రకటించిన విధానం మూలంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అసంఘటిత రంగ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా కనీస వేతనం 26,000 చెల్లించాలని లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి 20 లక్షల మందికి పైగా అసంఘటితరంగా కార్మికులు పనిచేస్తున్నారని అలాంటి వారి జీవితాలతో చెలగాటమాడకుండా పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మూడు జోన్ల విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో టి యు సి ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులు.. ప్రతిభకు నిలయాలు..

**ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి అమీరుద్దీన్**

**పది ఫలితాల్లో పాఠశాల టాపర్లకు తపస్ సత్కారం**


ఉత్తమ ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థినిని సన్మానిస్తున్న జిల్లా విద్యాధికారి అమీరుద్దీన్

**మక్తల్ టౌన్, మే 24 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మక్తల్ శాఖ మండల అధ్యక్షుడు నర్సిములు ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి అమిరుద్దీన్ , జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ,రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ బడుల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రతిభకు నిలయాలుగా మారుతున్నాయని అన్నారు.బడుల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎన్ని అవరోధాలు ఉన్న ఎదుర్కొని విజయం సాధిస్తారని అన్నారు. ప్రభుత్వ బడి పిల్లలు ప్రతిభగల పిడుగులని పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని కోరారు.ఫలితాల్లో మండలంలోని ప్రతి పాఠశాల నుండి టాపర్గా నిలిచిన విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందించి శాలువాతో సన్మానించారు. విద్యార్థులకు చక్కని ప్రోత్సహించి అందించి 100% ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మరియు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగార్జున, భీంరెడ్డి, వెంకట్ రాములు,గుడిగండ్ల ప్రధానోపాధ్యాయులు గురుపాధయ్య,గురుకుల ప్రిన్సిపాల్ రాములు, మిస్కిన్ శ్రీనివాస్,రాజ్ గోపాల్, నరేంద్ర చారీ ప్రధాన కార్యదర్శి రాకేష్, సహా కార్యదర్శి రాజంజనేయులు,కోశాధికారి అనిల్ రెడ్డి, కాంప్లెక్స్ కన్వీనర్లు రవీందర్ రెడ్డి, జగదీశ్, మహిళ ఉపాధ్యక్షులు వీణ,మండల కార్యదర్శులు వెంకటేష్, నర్సింహా, రామ్ భగత్, నర్సిములు ,చిట్యాల నర్సిములు,నరేష్,కృష్ణ,మక్తల్ మండలంలోని పదవ తరగతి టాపర్ విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సుకు సైనికుల్లా పని చేయాలి


వైద్య శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట, మే 24 ప్రభాతవార్త :** నారాయణ పేట పట్టణంలోని యశోద హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ రేడియాలజిస్ట్ డా రవీందర్ లకావత్ పర్యవేక్షణలో ఉచిత రేడియాలజీ అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ మాట్లాడుతూ సమాజంలోని పేదల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని, సాటి మానవులకు తమవంతు సేవలు అందించినప్పుడే మానవ జన్మ సార్థకమవుతుంది అన్నారు.నిరుపేద ప్రజలకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వారు పేర్కొన్నారు 2026 సంవత్సరంలో లయన్స్ క్లబ్ తొలి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన సరిత బట్టడ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమని, ఆమె సేవలను ప్రత్యేకంగా అభినందించారు. స్కానింగ్ సేవలను కూడా ప్రారంభించారు. ఈ ఆరోగ్య శిబిరంలో సుమారు 350 మంది పాల్గొన్నారు. వారికి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌తో పాటు ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన వారికి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రవిగౌడ్, జనార్ధన్, కోశాధికారి రాధ, సదానంద్ చారి, ఆత్మరాం, ఏడీకే బీంచందర్ గౌడ్, శ్రీనివాస్ లాహోటి, చిట్టెం మాధవ రెడ్డి, బాలాజీ కాంబ్లే, కృష్ణమూర్తి ఎల్లేరి, సత్యనారాయణ, సురేందర్ చారి తదితరులు,యశోద ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# దామరగిద్దలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**దామరగిద్ద, మే 24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000,2001 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.25 సంవత్సరాల అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమం ప్రారంభంలో తమకు బోధించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి, తమ జీవితాల్లో వారికి ఉన్న పాత్రను స్మరించుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రతి ఒక్కరూ తమ విద్యా, ఉద్యోగ, కుటుంబ జీవిత అనుభవాలను సహపాఠులతో పంచుకుంటూ ఆత్మీయంగా మమేకమయ్యారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు విద్యార్థులకు లక్ష్యసాధన, క్రమశిక్షణ, కష్టపడి చదవడం వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాల అనేది జీవితానికి బలమైన పునాది వేస్తుందని, ఎన్నేళ్లు గడిచినా పాఠశాల జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత వల్లే తాము ఈ స్థాయికి చేరుకున్నామని తెలిపారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, సరదా సంభాషణలు, పాత జ్ఞాపకాల పంచుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాలు మరింత బలపడేందుకు ఇలాంటి సమ్మేళనాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బూర్గుపల్లి చౌడేశ్వరి బోనాల ఉత్సవం


బోనాలతో ఊరేగింపుగా మహిళలు

**జడ్చర్ల, మే 24, ప్రభాతవార్త :** జడ్చర్ల మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో యాదవుల కులదేవత శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరము కులదేవతను కొలుచుకొని, బోనాల సమర్పించి, తమ జీవాలను దేవాలయ ప్రాంగణంలో నిలిపి పొలి జల్లుకొని తెల్లవారు జాగారం చేస్తారు. బోనాల ఊరేగింపులో బీ ర్లవారు డోలు వాయిస్తూ నృత్యాలుచేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో బూర్గుపల్లి కృష్ణ యాదవ్, పెద్దగొల్ల మల్లేష్, ఎడ్ల చెన్నయ్య,గోరంట్ల మల్లేష్, కొండల్ యాదవ్, మేడిపూరి పెద్ద నర్సిములు, బైకని మల్లేష్, దశరథం,మేడిపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి

**ఉప్పునుంతల, మే 24 ప్రభాతవార్త :** నేడు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అద్దంకి సునీత,ఉప తహసీల్దార్ రమేష్‌లు తెలిపారు. ఈ ప్రజావాణి కి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని, ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం పరుచుకోవాలని వారు కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

**నర్వ, మే 24 ప్రభాతవార్త:** సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధి దారుల కుటుంబ సభ్యులకు నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి.అశోక్ గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షులు కొండప్ప అందజేశారు.నర్వ మండల పరిధిలోని ఉండేకోడ్ గ్రామంలోని గ్రామ పంచాయతి కార్యాలయం దగ్గర ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఈడిగె సుజాత కు 72 వేల ఐదు వందలు,మాదారం ఈశ్వర్ రెడ్డి కి 47వేల ఐదు వందలు మంజూరైన ఎల్‌వోసీ లెటర్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,సి నాగప్ప గౌడ్,మొట్టె చిన్న నారాయణ,ఉప్పర శ్రీనివాసులు,కుమ్మరి ఆంజనేయులు,సి.వెంకటేష్ గౌడ్,కే భాస్కర్ రెడ్డి, రామలింగం,మంగలి రఘు,వెంకటయ్య గౌడ్, డి.కురుమూర్తి, జంగిటి బాలయ్య,మొట్టె పెద్ద నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు


విరిగిపడ్డ చెట్టును పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్

**చిన్న చింతకుంట, మే 24 ప్రభాతవార్త :** మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షంతో కూడిన ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పర్దిపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈదురు గాలులకు చెట్లు విరిగిపడడంతో విద్యుత్ తీగలు తేగడంతో విద్యుత్ సరఫరా , జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ తెలిపారు. రాత్రి వేళల్లో ఆయా వార్డులలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం విరిగిపడ్డ చెట్టును పరిశీలించి వెంటనే తొలగించి రాకపోకలకు అవకాశం కల్పించారు. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అప్రమత్తం చేసిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## అండర్ 20 విభాగంలో రాష్ట్ర స్థాయికి వెల్టూరు విద్యార్థి



**ఉప్పునుంతల, మే 24 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామానికి చెందిన కుర్రాడు షకిల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 20 విభాగంలో 100 మీటర్లు ప్రథమస్థానం సాధించాడు. అదేవిధంగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు.జూన్ 7న జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో రాష్ట్రస్థాయిలో వరంగల్ జిల్లా హనుమకొండలో జరిగిన అండర్ 20 విభాగంలో 100 మీటర్ విభాగంలో దాదాపు మూడు సార్లు పాల్గొన్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వివరించారు. జూన్ 7న జరుగు రాష్ట్రస్థాయి పోటీలో ప్రథమ స్థానం సాధించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వెల్టూరు గ్రామానికి చెందిన కుర్రాడు షకీల్ అండర్ 20 విభాగంలో 100 మీటర్లు ప్రథమ స్థానం సాధించినందుకు గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, గ్రామస్తులు, యువకులు షకీల్ ను ప్రత్యేకంగా అభినందించారు.

## పిడుగు పడి గేదె మృతి



**మద్దూరు, మే 24 ప్రభాతవార్త :** మద్దూరు మండలంలోని లక్కాయపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి గేదె మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. లక్కాయి పల్లి గ్రామానికి చెందిన రైతు సిరా సత్యంకు చెందిన గేదె పొలాల సమీపంలో మేత మేస్తుండగా అకస్మాత్తుగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది అని రైతు తెలిపారు.ఈ ఘటనలో సుమారు రూ.70 వేల మేర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో..

**నెట్ హౌస్ ధ్వంసం విరిగిన చెట్లు.. సోలార్ ప్లేట్స్**

**సుమారు పది లక్షల వరకు నష్టం : ప్రిన్సిపాల్ సుకన్య వెల్లడి**



భారీ వర్షం ఈదురు గాలులతో ధ్వంసమైన నెట్‌హౌస్

**జడ్చర్ల, మే 24 ప్రభాతవార్త :** స్థానిక డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ గాలి వాన బీభత్సానికి సోలార్ ప్యానల్స్, రేకుల షెడ్, బట్టర్ పై ఎలక్ట్రికల్ పోల్స్, తెలంగాణ బొటానికల్ గార్డెన్లో ఇటీవల నిర్మించిన నెట్ హౌస్ అదే విధంగా పెద్దపెద్ద చెట్లు సుమారు పదికి పైగా విరిగిపోయాయి. ఈ బీభత్సం యొక్క నష్టం సుమారుగా 10 లక్షల వరకు ఉండవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ॥ సుకన్య తెలిపారు. కళాశాలకు సెలవులు కావడం వల్ల ప్రమాదం ఏమి జరగలేదు. పెద్దపెద్ద చెట్ల కొమ్మలు విరిగి పడటం వల్ల ఫెన్సింగ్ ఎక్కడెక్కడ విరిగిపోయాయి. మొదటి అంతస్తులో ఉన్న రేకుల షెడ్డు కు సంబంధించిన రేకులు మొత్తం అమాంతం ఎగిరిపోయి సిగ్నల్ గడ్డకు సమీపంలో పడ్డాయి. ఈ నష్టాన్ని ప్రత్యక్షంగా గమనించిన గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య కళాశాల ప్రిన్సిపాల్‌కు వివరించారు.

## అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ

**ధన్వాడ, మే 24 ప్రభాతవార్త:** బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి మరికల్ పోలీస్‌లు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌కోట చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను ఎస్ఐ విక్రమ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్ఐ విక్రమ్ పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాల పత్రాలు పరిశీలించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై జరిమానాలు విధిస్తూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ విక్రమ్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణా పెరిగే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ద్వారా 24 గంటల పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. పశువుల రవాణాకు సంబంధించిన అనుమతులు, వాహనాల పత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. అక్రమ రవాణా లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గడ్డం శ్రీనివాస్‌కు సన్మానం

**చిన్నంబావి, మే 24 ప్రభాతవార్త :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా నియామకం పొందిన డా.గడ్డం శ్రీనివాస్‌ను చిన్నంబావి మండలం పెద్దమారు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం,గ్రామసర్పంచ్ కేతపాగ జయమ్మ లక్ష్మయ్య ఆధ్వర్యంలో సన్మానించడం జరిగినది. సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ శ్రీ డాక్టర్ గడ్డం శ్రీనివాసులుని ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమించడం జరిగిందనీ, స్వగ్రామం అయిన పెద్దమరూర్ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా ఆయన డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనను ఘనంగా శాలువాలతో సన్మానించడం జరిగినది. అతి కొద్ది కాలంలోనే రాష్ట్రస్థాయి నాయకునిగా ఎదిగినందుకు అందరు సంతోషం వ్యక్తపరిచారు. ఇంకా పార్టీలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి మండలానికి పేద ప్రజలకు ఎంతో సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కేతపాగ లక్ష్మయ్య డా.తిరుపతిరావు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, వార్డ్ మెంబర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి మూడు ఆవులు మృతి

**నష్టం జరిగిన గ్రామాల్లో అధికారుల పరిశీలన**

**నవాబుపేట, మే 24 ప్రభాతవార్త :** శని,ఆదివారం కురిసిన భారీవర్షం, బలమైన గాలులతో పాటు పిడుగులతో పడిన వర్షాలకు మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలోని నాయిని చిన్న చెన్నయ్యవి రెండు ఎద్దులు చౌదూరు గ్రామానికి చెందిన అబ్దుల్ సత్తార్ ది ఒక ఎద్దు,పిడుగుపాటుకు గురై మరణించాయి. మండల అధికారులు రైతు చెన్నయ్య దూడల వివరాలు సేకరించి కూచూరు దొడ్డిపల్లి ఇప్పటూరు చౌటపల్లి గ్రామాల్లో అధికారులు రైతులకు గ్రామస్తులకు కలిగిన నష్టాలను అంచనా వేయడానికి మండల అధికారులు ఇప్పటూరు చౌటపల్లి కూచూరు చౌదూరు దొడ్డిపల్లి గ్రామాల్లో నష్టం జరిగిన గ్రామస్తుల దగ్గరికి వెళ్లి వివరాలు సేకరించారు. కూచూరు, దొడ్డిపల్లిలో జరిగిన నష్టము పశువుల షెడ్లు దొడ్డుపల్లి గ్రామస్తుల నలుగురు రైతుల షెడ్లు పైకప్పులు ఎగిరిపోవడం, గ్రామాల్లో నాలుగైదు స్తంభాలు విరిగిపడ్డ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కూచూరు లో విరిగిన స్తంభాలు ఇంటిపై కప్పుల నష్టాన్ని అంచనా వేసి వివరాలు సేకరించారు. విరిగిన స్తంభాలకు మరమ్మతులు చేసేలా చర్యలు చేపడతామని, జరిగిన పశువుల నష్టానికి ప్రభుత్వం, సహాయం చేసేలా చర్యలు చేపడతామని అధికారులు రైతులకు గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు అర్ఐ రామాంజనేయులు, రైతులు, గ్రామ సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పది ప్రతిభావంతులకు సన్మానం

**చిన్నంబావి, మే 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోనీ కొప్పునూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ప్రతిభ సాధించిన 17 మందికి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం, జై భీమ్ స్నేహ సేవ సమితి అధ్యక్షులు సింగరిగల్ల వెంకటస్వామి, మండల ఎస్పై రామన్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతిభ సాధించిన పదవ తరగతి విద్యార్థులను శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పై రామన్ గౌడ్ మాట్లాడుతూ కొప్పునూర్ గ్రామంలో అత్యధికంగా అంబేద్కర్ కాలనీకి చెందిన విద్యార్థులు ప్రతిభ సాధించడం గొప్ప విషయం అని, భవిష్యత్తులో గొప్ప విద్య అభ్యసించాలని కొనియాడారు. అలాగే పేద విద్యార్థులకు జై భీమ్ స్నేహ సేవ సమితి సంఘం తరుపున సహాయ సహకారాలు అందిస్తామని వెంకటస్వామి తెలిపారు. కాలనీ కి చెందిన 17 మందికి షీల్డ్ మేమెంటోతో అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు మునిస్వామి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు విష్ణు, మద్దిలెట్టి, బిస్మా, తలారి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు తలారి నిర్మలమ్మ, చెన్నయా, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

## అపూర్వం..పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**దేవరకద్ర,మే24 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 2010, 11 ఏడాదిలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం దేవరకద్ర మండలంలోని లక్ష్మీ పల్లి సమీపంలో ఉన్న భవాని రిసార్టులో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం భాగంగా సరస్వతి విగ్రహాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం 10 విద్యార్థులకు పాఠాలు బోధించి స్వర్గస్తులైన గణిత శాస్త్ర ఉపాధ్యాయులు నాగేందర్ మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థులకుపాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకొని నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం జీవితంలో తాముచేస్తున్న అంశాలను ఉపాధ్యాయులకు వివరించారు. పూర్వ విద్యార్థులు కొన్ని ఏళ్లతర్వాత కలుసుకోవడం చాలాసంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామలింగం, ఉపాధ్యాయులు రాజశేఖర్, సతీష్, రాములు, కొండన్న, సల్మాన్, రాజు, నీలిమ, ప్రసన్న, అరుణ, జ్యోతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

**బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ**

**వనపర్తిరూరల్,మే 24, ప్రభాతవార్త:** ధాన్యం తడిసిపోయి దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ఉన్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. ఆదివారం బిజెపి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న శ్రద్ధ రైతుల ధాన్యం కొనుగోలుపై లేదని గత రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తడిచిపోయింది అన్నారు. దీనికి ప్రధానకారణం కాంగ్రెస్ ప్రభుత్వం దాన్యం రవాణా టెండర్లను అనుభవం లేని కాంగ్రెస్ పార్టీ నాయకులకు అప్పగించడమేనని, లారీలు సమకూర్చడంలో సదరు కాంగ్రెస్ నాయకులు చేతులెత్తేయడంతో రైతులు తమ సొంతగా కిరాయి వెచ్చించి ట్రాక్టర్ల ద్వార మిల్లులకు చేరవేస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యంతో దాన్యం పూర్తిగా తడిసిపోయిందని దానికి రైతులను బాధ్యులుగా చేస్తే బిజెపి పార్టీ చూస్తూ ఊరుకోదని తడిసిన, మొలకెత్తిన ధాన్యం చివరి గింజ వరకు కొనే బాధ్యత ప్రభుత్వాని దేనని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిలు పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, కోశాధికారి బండారు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

**వనపర్తి, మే 24, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయడమే లక్ష్యంగా, అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఆదివారం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసారి అనసూయ, సహా ఇతర సహచర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లు, అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ, రాబోయే పది రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు వచ్చి ఇంకా కొనుగోలు చేయని ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని వారికి భరోసా కల్పించాలని, కలిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి బాయిల్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తెలంగాణలో ప్రక్రియ కొనసాగుతుంది అని తెలిపారు. ఈ ఒక ఏడాదిలోనే వరి ధాన్యం కొనుగోళ్ల కు సంబంధించి రైతుల ఖాతాల్లో 45 వేల కోట్ల రూపాయలను జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతుల సంక్షేమం అని తెలిపారు. ఈ పది రోజులు అందరూ కలెక్టర్లు వరి ధాన్యం కొనుగోళ్ల పైనే దృష్టి పెట్టి సజావుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట స్థానిక హమాలీలను నియమించు కోవాలన్నారు. రవాణా సమస్య లేకుండా చూడాలన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్న ఇతర పంటలను రైతులు తెలంగాణలోకి తరలించకుండా సరిహద్దు జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

**"ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్స వాలు విజయవంతంగా నిర్వహించాలి: మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.**

"ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా, మహిళా వారోత్స వాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ అన్ని కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. నిర్దేశించిన గడువులోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రోజువారీగా నిర్దేశిత కొనుగోలు లక్ష్యాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. లారీల విషయంలో ఎటువంటి సమస్య తలెత్తడానికి వీలులేదని, రవాణా శాఖ అధికారులు చొరవ తీసుకొని ఖాళీగా ఉన్న లారీలు డీసీఎంలు ట్రాక్టర్లను ధాన్యం తరలించడానికి మళ్ళించాలని ఆదేశించారు. అదేవిధంగా ధాన్యం అన్లోడ్ చేయడానికి గోడౌన్ లలో అవకాశం ఉన్న వాటిని వెంటనే అందుబాటులోకి తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా, మహిళా వారోత్స వాలు విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి అనే నినాదంతో మహిళా అభివృద్ధి కొరకు పాటుపడుతుందని అన్నారు. ఈనెల 25 (రేపటి) నుంచి, 30 వ తేదీ వరకు మహిళా వారోత్స వాలు ప్రణాళిక ప్రకారం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజు అన్ని కార్యక్రమాలను మహిళలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని తెలిపారు. నిర్దేశించిన విధంగా ప్రతిరోజు రోజువారి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, సిఎస్ఓ కాశీ విశ్వనాథ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిఆర్డిఓ ఉమాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొండూరు గ్రామంలో అకాల వర్షం.. విరిగిపడిన చెట్లు

**కొల్లాపూర్,మే 24, ప్రభాతవార్త :** కొండూరు గ్రామంలో నిన్న కురిసిన అకాల వర్షం,గాలి దుమారం కారణంగా భారీ చెట్లు విరిగిపడి రోడ్లపై అడ్డంగా పడటంతో గ్రామంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఉదయం తెల్లవారుజామునుంచే గ్రామ సర్పంచ్ కేతూరి ధర్మతేజ, మాజీ సర్పంచ్ నల్లబోతుల గోపాల్‌లు గ్రామంలో స్వయంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మండల విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎడి విజ్ఞాన్, సిబ్బందితో సమన్వయం చేసి విరిగిపోయిన కరెంటు స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో విరిగిపడిన భారీ చెట్లను జేసీబీ సహాయంతో తొలగించి గ్రామ పంచాయతీ సిబ్బందితో రోడ్లను శుభ్రం చేయించారు. తీవ్ర గాలుల కారణంగా గ్రామంలో నివాస గృహాల వద్ద ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు ఎగిరిపోవడం,చెట్లు షెడ్లపై పడటంతో కొన్ని కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం కల్పించారు. అలాగే గ్రామానికి ప్రవేశించే ప్రధాన మార్గంలో ముళ్లపొదలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో కంపచెట్లను పూర్తిగా తొలగించి రహదారిని సురక్షితంగా మార్చారు ఆలయంలో రావి చెట్టు గుడికి అడ్డంగా పడడంతో జెసిబి సహాయంతో తొలగించి భక్తులకు అంతరాయం కలగకుండా చూశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాముడు, వార్డు మెంబర్లు కావాలి ఈశ్వరయ్య దొబ్బలి వెంకటయ్య రెడ్డి నరేష్, గ్రామ నాయకులు రామకృష్ణ, కరుణాకర్, కోటేష్,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

## భూములు కోల్పోయిన ప్రజలకు నష్టపరిహారం ఇవ్వాలి


**కొల్లాపూర్, మే 24,ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ కొల్లాపూర్ మండల కమిటీ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధ పర్వతాలు హాజరై ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంపైన విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకుంటుంది తప్ప నిధులు కేటాయించి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు మా హాయంలో ఎక్కువ నిధులు ఇచ్చాం మీ ఆయములో అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శలు చేసుకోవడం తప్ప ఒక్క అడుగు ముందుకు పడడం లేదన్నారు. విమర్శలు చేసుకోవడం మానుకొని అభివృద్ధి పనుల్లో తమ యొక్క సత్తా ఏందో చూపించాలని వారన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా పేపర్ ప్రకటనలకే పరిమితం కావడం సరికాదన్నారు. ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నేటి వరకు పరిహారం ఇవ్వకపోగా ఇంకా పూర్తిస్థాయిలో భూసేకరణ చేయకపోవడం దీనికి నిదర్శనం అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిపక్షాల పైన విమర్శలు మానుకొని ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులను వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. మార్కెట్లలో రైతులు తమ ధాన్యాన్ని నిల్వ ఉంచి రెండు నెలలు కావస్తున్న నేటికీ కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ ప్రాంతంలో ఫారెస్ట్ భూములకు రైతులు సాగు చేస్తున్నారు వారి అందరికీ పట్టాలు ఇవ్వాలని వారన్నారు సాదా బైనమా పేరుతో నోటీసులు ఇస్తూ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.



మాట్లాడుతున్న వర్ధ పర్వతాలు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి

## బాలాజీ నగర్‌లో బీజేపీ బస్తీ బాట

**జడ్చర్ల, మే 24, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు బాలాజీ నగర్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ దళిత రత్న అవార్డు గ్రహీత డా. కొంగలి శ్రీకాంత్ అడ్వకేట్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ బస్తీ బాట కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. "ప్రజల కష్టాలు తెలుసుకోవడమే మా లక్ష్యం పరిష్కారమే మా బాధ్యత" అనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కొంగలి శ్రీకాంత్, పార్టీ సీనియర్ నాయకులు నడిమింటి శ్రీనివాసులు, మాజీ కిసాన్ మోర్చా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాల కృష్ణ, సీనియర్ కార్యకర్తలతో కలిసి బాలాజీ నగర్‌లోని ప్రతి ఇంటిని సందర్శించారు. స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి దీర్ఘకాలిక సమస్యలను, మౌలిక వసతుల కొరతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. కొంగలి శ్రీకాంత్ అడ్వకేట్ శ్రీనివాసులు బాలకృష్ణ మాట్లాడుతూ సేవే లక్ష్యం, సమాజమే దేవాలయం, ప్రజలే నా బలం అని నమ్మి మేము ముందుకు సాగుతున్నామన్నారు. బాలాజీ నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్లు, మౌలిక సదుపాయాల సమస్యలను , డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు కోసం, పెన్షన్ కోసం, జడ్చర్ల మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే మా బస్తీ బాట ముఖ్య ఉద్దేశం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ రాష్ట్ర మాజీ కిసాన్ మోర్చా నాయకులు ,బీజేపీ సీనియర్ నాయకులు నడిమింటి శ్రీనివాసులు, టౌన్ బీజేపీ ఎస్సీ మోర్చా ప్రెసిడెంట్ జగదీష్, దళితసంఘంనాయకులు కృష్ణ, అంజనేయులు, 26వ వార్డ్ యువ నాయకులు విష్ణు, అరుణ్, పవన్, శ్రీనివాసులు,లక్ష్మణ్, కిరణ్ కుమార్ వార్డు ప్రముఖులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



బిజెపి బస్తీబాటలో నాయకులు

## వరి గడ్డి కాల్చివేతపై రైతులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్

### నేల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం : వ్యవసాయ శాఖ

**నారాయణపేట, మే 24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారి జాన్ సుధాకర్, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయ సంచాలకులు రైతులకు వరి పొలాల్లో గడ్డి కాల్చివేత వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వరికోత అనంతరం పొలాల్లో మిగిలే గడ్డి లేదా పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని నత్రజని, ఫాస్పరస్, పొటాషియం వంటి కీలక పోషకాలు నష్టపోతాయి. దీంతో నేల సారవంతత తగ్గిపోవడంతో పాటు భూమి సహజశక్తి దెబ్బతింటుంది. అంతేకాకుండా నేలలో నివసించే సూక్ష్మజీవులు, వానపాములు నశించడం వల్ల నేల ఆరోగ్యం క్షీణిస్తుందని పేర్కొన్నారు పంట అవశేషాలను కాల్చడం వల్ల కార్బన్ డయాక్సైడ్ మీథేన్ నైట్రస్ ఆక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై పర్యావరణ కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు ఇది పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని తెలిపారు అలాగే పంట గడ్డి కాల్చివేతకు పాల్పడితే చట్టపరమైన చర్యలు, జరిమానాలు, జైలు శిక్షలు ఎదుర్కోవాల్సి వచ్చే అవకాశం ఉందని రైతులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు రైతులు గడ్డి కాల్చే విధానానికి బదులుగా మల్చింగ్, కంపోస్టింగ్, పంట అవశేషాలను నేలలో కలపడం, బయోడీకంపోజర్ స్ప్రేల వినియోగం, హ్యాపీ సీడర్ లేదా సూపర్ సీడర్ వంటి యంత్రాల ఉపయోగం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ సూచించింది పంట అవశేషాలను శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ పంటల దిగుబడుల పెరుగుదలకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**రేవల్లి , మే 24 ప్రభాతవార్త:** రేవల్లి మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో 2002, 03, సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 సంవత్సరాల తర్వాత చిన్ననాటి మిత్రులను పాఠశాలలో కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్, బుచ్చిరెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ స్కూల్ టాపర్స్‌కు సన్మానం



టాపర్స్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ, సర్పంచి స్థానిక నాయకులు

**భూత్పూర్,మే 24,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం పోతులమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల నిర్వ హించిన టెన్త్ బోర్డు పరీక్షల్లో స్కూల్ టాపర్స్‌గా నిలిచిన ఐదు గురు విద్యార్థుల్ని పాఠశాల జీహెచ్ఎం,మండల విద్యాశాఖాధి కారిణి ఉషారాణితో పాటు స్థానిక సర్పంచి ఆనందర్‌రెడ్డి ఇతన నాయకులు మెడల్స్‌తో సత్కరించి అభినందించారు.పాఠశాల నుంచి 2026 మార్చిలో నిర్వహించిన టెన్త్ పబ్లిక్ పరీక్షలకు గాను పాఠశాల నుంచి మొత్తం 27మంది విద్యార్థిని,విద్యార్థులు హాజరుకాగా,వీరిలో 24మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పాఠశాల జీహెచ్ఎం ఉషారాణి తెలిపారు..వీరిలో స్కూల్ టాపర్స్‌గా నిలిచిన ఐదుగురిని ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాఠశాల జీహెచ్ఎం,భూత్పూర్ మండల ఇంచార్జ్ ఎంఈఓ ఉషారాణితో పాటు సర్పంచి ఆనందర్‌రెడ్డి,మాజీ సర్పంచి హరియా నాయక్ మెడల్స్‌తో పాటు పూలమాలలు,శాలువలతో ఘనంగా సత్కరించారు.వీరితో పాటు ఇదే పాఠశాలలో చదివి ఇతర గురుకులాలు,సైనిక్ స్కూల్,రెసిడెన్సియల్ కళాశాలల్లో విద్యనభ్యసించే పూర్వపు విద్యార్థులు 11మందిని జీహెచ్ఎం,సర్పంచి,మాజీ సర్పంచి,గ్రామ యువకులు మెడల్స్‌తో సత్కరించారు.

## వసతి గృహ నిర్మాణానికి భూమి కేటాయింపు :పియు విసి శ్రీనివాస్

**మహబూబ్‌నగర్, వనపర్తి, మే 24 ప్రభాతవార్త :** పీజీ సెంటర్ వనపర్తిలో బాలుర వసతి గృహ నిర్మాణానికి 35 గుంటల ప్రభుత్వం భూమి కేటాయిస్తూ కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశాలు జారీ చేసినట్లు పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జి ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నారు.పీజీసెంటర్ వనపర్తిలో బాలుర హాస్టల్‌నిర్మాణంవల్ల గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించగలరని,హాస్టల్ సౌకర్యం వల్ల విద్యార్థులు తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావడం ఎక్కువ సమయం చదువుకు కేటాయించడం వల్ల మంచి ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. దూర ప్రయాణ కారణంగా చదువు మానేయాల్సిన పరిస్థితులు తగ్గుతాయని పేర్కొన్నారు.భూ కేటాయింపునకు సహకరించిన వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, తెలంగాణ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మెన్, డా.జి. చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ సురభికి కృతజ్ఞతలు తెలిపారు.

## మల్లికార్జున్ ఖర్గేను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట, మే 24 ప్రభాతవార్త:** ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామి కాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల అమలు, కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల మధ్య నెల కొన్న పలు జల కేటాయింపుల అంశంపై ఖర్గేతో చర్చించారు.ఇటీవల కేరళలో ఘన విజయం సాధించినందుకు ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు.



# నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

### మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి మున్సిపాలిటీ , మే 24, ప్రభాతవార్త :** జిల్లాలో అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లు, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.



గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షి ంచబోమన్నారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ,జిల్లాలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మహిళా సంక్షేమ వారోత్సవాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి, షెడ్యూల్ మేరకు కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, సివిల్ సప్లై డీఎం జయశ్రీ, మెప్మా అధికారి రామాచారి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

### ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో...

## రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్**

**నర్సాపూర్, రూరల్ మే 24 ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలంలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాల్లో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యం నెల రోజులుగా నిల్వ ఉండిపోయిందని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో సంచుల కొరత, కూలీల సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మెదక్ జిల్లా శాఖ రైతులకు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని భరోసా ఇచ్చారు.

రేపటి నుంచి బీజేపీ రాష్ట్ర పార్టీ మూడు బృందాలుగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులను కలుసుకుంటుందని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపట్టేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, నర్సాపూర్ మండల అధ్యక్షుడు నీలి నగేష్, సీనియర్ నాయకుడు సంజీవ్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సదానందం, మహేష్, ప్రశాంత్, మల్లేశం, ప్రవీణ్, భాస్కర్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన వై. నరోత్తం

**జహీరాబాద్, మే 24 (ప్రభాత వార్త):** విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ను ఆదివారం ఆయన నివాసంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం మర్యాదపూర్వకంగా కలిశారు.



విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం

ఈ సందర్భంగా హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేసిన వై. నరోత్తం, ఆయన విదేశీ పర్యటనకు సంబంధించిన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై ఇరువురు స్వల్పంగా చర్చించినట్లు సమాచారం.

హరీష్‌రావు విజయవంతంగా విదేశీ పర్యటన పూర్తి చేసుకుని తిరిగి రావడంపై వై. నరోత్తం హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

## కొల్చారం మండల కేంద్రంలో విషాదం

### అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**కొల్చారం, మే 24 (ప్రభాత వార్త):** అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అహ్మద్ మొహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం (48) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆయన భార్య రేణుక కూలీ పనులు చేస్తూ కుటుంబ పోషణకు తోడ్పడుతోంది.

ఆదివారం ఉదయం రేణుక కూలీ పనులకు వెళ్లగా వెంకటేశం ఇంటి వద్దే ఉన్నాడు. మధ్యాహ్నం సమయంలో స్వగృహంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన వెంకటేశం తండ్రి కిష్టయ్య వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గతంలో జరిగిన ప్రమాదంలో వెంకటేశానికి తీవ్ర గాయాలు కావడంతో ఒక కాలు విరిగిందని, అలాగే ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు పేరుకుపోవడంతో వాటిని ఎలా తీర్చాలనే ఆందోళనలో ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల భారం భరించలేక మనస్తాపానికి గురై ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

## పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### -సంరక్షణ కేంద్రానికి 4 ఎడ్లు 3 ఆవులు-ముగ్గురిపై నమోదైన కేసులు

**న్యాల్‌కల్, మే 24, ప్రభాతవార్త:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణాటకలోని బీదర్ పట్టణం నుంచి నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణానికి అక్రమంగా తరలుతున్న 7 పశువులను అడ్డుకున్న సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం...అక్రమంగా పశువులు (ఆవులు) తరలకుండా జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ సూచనల మేరకు మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తా జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు గుండా వెళుతున్న కెఎ 38 ఎ 8231 వాహనంను ఆపి తనిఖీ చేయగా వాహనంలో 4 ఎడ్లు, 3 ఆవులు కానవచ్చాయి. పశువుల రవాణాకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు 7 పశువులను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహన డ్రైవర్ బల్బీం, క్లీనర్ కురేషి అల్తే, యజమాని అజర్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



అక్రమంగా తరలిస్తున్న 7 పశువులను పోలీసులు అదుపులోకి తీసుకున్న దృశ్యం

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు బంగారు భవిష్యత్

- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- సాగును ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సబ్సిడీపై మొక్కలు, ఎరువుల అందజేత

**నార్సింగి, మే 24, ప్రభాతవార్త:** ఫామ్ ఆయిల్ సాగుతో రైతులకులాభదాయకం అని నార్సింగి మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటలలో ప్రస్తుతం మార్కెట్ ఉన్న పంట ఆయిల్ పామ్ మాత్రమే, ఆయిల్ కంపెనీలతో ఒప్పందం చేసుకుని సాగు చేసే పంట రైతులు అమ్మడానికి కూడా ఇబ్బందులు లేకుండా ఫామ్ ఆయిల్ సాగు పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. సబ్సిడీ కింద మొక్కలు డ్రిప్పు అందించడమే కాకుండా, నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా ఇస్తుంది. దిగుబడి ప్రారంభమయ్యే లోపు అంతర్ పంటల ద్వారా సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. వరి పత్తి పంటలతో పోలిస్తే పెట్టుబడి కూడా తక్కువగానే ఉంటుంది. అలాగే తక్కువ శ్రమతో అదిక లాభాలు సాధించే అవకాశం ఉందిని రైతులు సంప్రదాయ పంటల నుంచి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లాలని



ఫామ్ ఆయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధిక సబ్సిడీలతో పాటు గ్యారెంటీ ధర కల్పిస్తున్నందున దళారుల ప్రమేయం లేకుండా లాభాలు నేరుగా రైతులకే అందుతాయని తెలిపారు.

**..30 ఏండ్ల దాకా దిగుబడి**

ఆయిల్ పామ్ మొక్కలను ఒకసారి నాటితే 30 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తాయి. నాలుగో సంవత్సరం నుంచి రైతుకు పంట చేతికి వస్తుంది. మొదటి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు భరిస్తున్నది. మొదటి మూడు సంవత్సరాలు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, వరి, కూరగాయలు, లాంటి పంటలను అంతర పంటగా సాగు వేసుకోవచ్చు. నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి వస్తుంది. ఎకరాకు కనీసం 3 నుంచి 5 టన్నులకు తక్కువ కాకుండా దిగుబడి పొందవచ్చు. ఐదవ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం 2 టన్నుల దిగుబడి పెరుగుతుంది. చెట్టు పెరిగే కొద్దీ మెలకువలు పాటిస్తూ పది సంవత్సరాల తర్వాత 15 నుంచి 20 టన్నుల వరకూ దిగుబడి సాధించవచ్చు.

**..ఎకరాకు రూ.2లక్షల ఆదాయం**

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు మొదటి నాలుగు సంవత్సరాల్లో అంతర పంటల సాగుకు, ఎరువుల ఖర్చుల కోసం ఎకరానికి రూ.4,200 ఆర్థిక సాయం అందిస్తోంది. మార్కెట్లో రూ.193 ఉన్న మొక్కలను సబ్సిడీపై కేవలం రూ.20కే రైతులకు సప్లై చేస్తోంది. డ్రిప్ యూనిట్ ఖర్చులో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీగా అందిస్తోంది.

**..ఆయిల్ పామ్ వైపుగా దృష్టి సారించాలి**

**:భరత్ కుమార్,వ్యవసాయ శాఖ అధికారి..**

మండల రైతులు ఆయిల్ పామ్ వైపు దృష్టిసారించాలి. ఈ పంట సాగు చేసే రైతులకు తెలంగాణ ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నది. ఈ పంట మన ప్రాంతానికి కొత్త అయినా ఇక్కడి వాతావరణం, భూములు అనుకూలంగా ఉన్నాయి. మొక్కలు నాటడం, సస్యరక్షణ చర్యలు, పంటల విక్రయాల వరకు ఉద్యాన శాఖ అండగా ఉంటుంది. ఆసక్తిగల రైతులు నార్సింగి రైతు వేదిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

# కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికి వస్తే ఖబడ్దార్

**చిన్నశంకరంపేట,మే 24,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలంలో అధికార-ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు పోటాపోటీగా విమర్శలు చేసుకుంటూ ఆరోపణలకు దిగుతున్నారు. తాజాగా నాలుగు రోజుల క్రితం రైతు రాజయ్య ఆత్మహత్య విషయం రెండు పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. రైతు రాజయ్య ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని అధికార పార్టీ అంటే, లేదు ధాన్యం అమ్ముడుపోకనే రైతు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని బిఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తుంది. ఆగ్రహారం గ్రామానికి చెందిన రైతు రాజయ్యకు చెందిన ధాన్యం తూకం చేస్తే వచ్చే డబ్బులతో రైతు రాజయ్య చేసిన అప్పులు తీరిపోతుండే అని, కొనుగోలు కేంద్రాలకు లారిలు రాకపోవడంతోనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ఖండిస్తూ శుక్రవారం నాడు కాంగ్రెస్ నాయకులు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం బిఆర్ఎస్ నాయకులు కూడ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులను విమర్శించారు. ఆదివారం నాడు మరోసారి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోహన్ నాయక్ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేయగా జిల్లా నాయకులు రాజిరెడ్డి మాట్లాడుతూ...మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిని ఎక్కడా కూడ వ్యక్తిగతంగా కూడ దూషించలేదని, గత పాలనలో అభివృద్ధి చేయలేదని తెలిపారు. వ్యక్తిగతంగా మాట్లాడామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్‌లో ఉన్న నాయకులు కొందరు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ ఖండువా కప్పుకున్నారని, కాంగ్రెస్‌లో చేరిన నాటినుండి పద్మారెడ్డి, కొంత మంది మండల నాయకుల కుటుంబసభ్యుల గురించి, మరో నాయకుడు గురించి పూర్తి వివరాలను తెలిపింది వారేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లో చేరి ఇప్పుడు ఏమి ఎరగనట్లు తిరిగి మాపై విమర్శలు చేయడం తగదన్నారు. బిఆర్ఎస్ నాయకులు బహిరంగ సమావేశానికి హాజరు కావాలని, వారిని తిట్టిన విషయం, మీ నాయకులు మాట్లాడిన విడియో టెపులు, ఆధారాలు కూడ మా వద్ద ఉన్నాయని అన్నారు. ఓ గిరిజన బిడ్డను మండలాధ్యక్షుడిని చేసిన ఘనత కాంగ్రెస్‌దే అని, బిఆర్ఎస్ పాలనలో ఒక్క దళిత బిడ్డ అయినా మండలానికి అధ్యక్షునిగా పనిచేశాడా అని ప్రశ్నించారు. మండలంలో ఎన్ని రెండు పడకగదులు ఇచ్చారో చెప్పాలన్నారు. ఇప్పుడు ఏ ఊరికి వెళ్లినా ఇందిరమ్మ ఇండ్లు దర్శనమిస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికి వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని, అవసరమైతే ఎక్కడిదాకా అయినా వెళ్లడానికి సిద్దంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మోహన్ నాయక్, రమేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, ఎడ్ల కిష్టయ్య, ప్రవిణ్, రాజాసింగ్, వెంకట్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

# చిలపల్లి భారీ-చోరీ కేసును ఛేదించిన మెదక్ పోలీసులు

### కోటి ముప్పై ఐదు లక్షల విలువైన బంగారం, వెండి వస్తువుల రికవరీ... ...ఒకరి అరెస్ట్ ..పరారీలో మరో ఇద్దరు...కేసు చేదించిన పోలీసు బృందాలకు రివార్డులు...మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు...




మీడియా సమావేశంలో నిందితున్ని ప్రవేశపెట్టిన పోలీసులు

**పెద్దశంకరంపేట, మే 24, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామంలో జరిగిన భారీ చోరీ కేసును మెదక్ జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేశామని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. దొంగిలించబడిన భారీ మొత్తంలో బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడిస్తూ...ఈ నెల 14వ తేదీ రాత్రి గ్రామంలోని తాళం వేసిన ఐదు ఇండ్లను లక్ష ్యంగా చేసుకున్న దుండగులు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. ఒకే ఇంట్లో సుమారు 109 తులాలు 9 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి వస్తువులు, రూ.19 వేల నగదు అపహరించారు. మరో ఇంట్లో మూడు తులాల బంగారం దొంగిలించారని పేర్కొన్నారు. ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామన్నారు. సాంకేతిక ఆధారాలు, గూఢచారి సమాచారంతో నిందితులను గుర్తించి రామాయంపేట సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 929.7 గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రధాన నిందితుడు జాదవ్ జైరాం నాయక్ అలియాస్ జెమ్లా నాయక్‌పై ఇప్పటికే పలు జిల్లాల్లో అనేక చోరీ కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. శంకరంపేటఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు కేసులతో పాటు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో జరిగిన మరో 12 కేసులను కూడా నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు.

మొత్తం 17 కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు.



రికవరీ చేసిన ఆభరణాలు

నిందితులను వేగంగా పట్టుకున్నందుకు బాధితులు రాములు, మాణిక్ రెడ్డి జిల్లా ఎస్పీతో పాటు కేసు దర్యాప్తు చేసిన పోలీసు సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాధితుడు రాములు మాట్లాడుతూ తమ బంగారం మళ్లీ దొరుకుతుందని ఆశించలేదని, దొంగతనం జరిగినప్పటి నుంచి పోలీసులు అండగా నిలిచి ధైర్యం చెప్పారని తెలిపారు. రాత్రింబవళ్లు కష్టపడి కేసును ఛేదించిన పోలీసు శాఖకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో విశేషంగా కృషి చేసిన ఐదు ప్రత్యేక బృందాల సిబ్బందికి రివార్డులు, నగదు పురస్కారాలు అందజేశారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన బంగారాన్ని బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని ఎస్పీ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు రేణుక రెడ్డి, జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్ రెడ్డి, పోచయ్య, సీసీఎస్ బృందం, ఐటీ కోర్ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.



పాము కాటుకు గురైన బాలుడు తనీష్

## వరిగుంటం గ్రామంలో విషాదం

### పాము కాటుతో బాలుడు మృతి

**కొల్చారం, మే 24, ప్రభాతవార్త :** కొల్చారం మండల పరిధిలోని వరిగుంటం గ్రామంలో పాము కాటుతో ఓ బాలుడు మృతి చెందిన విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దండు సుధీర్, భార్య, కుమారుడు దండు తనీష్ (7)తో కలిసి శనివారం రాత్రి భోజనం అనంతరం వేసవి కాలం కావడంతో ఇంటి ముందు వాకిట్లో నిద్రించారు.

ఆదివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో తనీష్ నిద్రలో నుంచి లేచి తన ఎడమ చేతి మధ్యవేలికి ఏదో కరిచిందని తండ్రికి తెలిపాడు. వెంటనే పరిశీలించగా వేలిపై గాయం కనిపించడంతో పాటు బాలుడు కప్పుకున్న దుప్పటిలో నల్లని నూనె కట్లపాము కనిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దీంతో వెంటనే బాలుడిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిన్నపిల్లల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సుమారు 6.20 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తన కుమారుడు ఇంటి ముందు వాకిట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురై మృతి చెందాడని, ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని బాలుడి తండ్రి దండు సుధీర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మహేష్ కుమార్ చేస్తున్న కృషి ప్రశంసనీయం


**నర్సాపూర్, మే 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కృషితో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ అన్నారు. ఆదివారం పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు నర్సాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా లు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గతంలో కంటే కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయిందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి మరియు ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలను విజయవంతం



పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్.

## దౌల్తాబాద్‌కు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించండి

**హత్నూర మే 24, ప్రభాతవార్త :** హత్నూర మండలం మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్‌కు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మేజర్ పంచాయతీ దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శిని, పక్కనే ఉన్న హత్నూర గ్రామ పంచాయతీకి ఇంచార్జిగా నియమించారని, ఇక్కడ మాత్రం వారానికి ఒక గ్రామపంచాయతీ కార్యదర్శి చొప్పున ఇన్చార్జిలుగా వచ్చి పోతున్నారని దీనివల్ల స్థానిక ప్రజలకు సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. తమ గ్రామపంచాయతీ కార్యదర్శి హత్నూరకు పంపడంలో అంతర్యం ఏమిటని వారు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఇన్చార్జి కార్యదర్శులను నియమిస్తున్నారే తప్ప, తమకు కేటాయించిన కార్యదర్శిని మాత్రం ఇక్కడికి పంపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పర్మినెంట్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో గత వారం రోజుల నుండి పంచాయతీ కార్యదర్శి రూముకు తాళం వేసి ఉందని, తమ పనులపై వచ్చే ప్రజలకు సరైన సమాధానం చెప్పేవారు లేకుండా పోయారని వారు



సమావేశాన్ని బహిష్కరించిన వార్డు సభ్యులు



తాళం వేసి ఉన్న పంచాయతీ కార్యదర్శి రూము

ఆరోపిస్తున్నారు. శనివారం జరిగిన గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి నియమించాలని కోరుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కాంగ్రెస్‌కి సంబంధించిన పలువురు వార్డు సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి దౌల్తా బాద్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని వారు డిమాండ్ చేశారు.